


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 16-04-2026 సంపుటి : 07 సంచిక 317 పేజీలు : 8 వెల : రూ 3-00



## సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి,రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వరం, వెలిగొండ, హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం-నలమల్ల సాగర్ లింక్, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులపై సమీక్ష జరిపారు. రాష్ట్రంలో భూగర్భజలాల పెంపు, జల ధార, జల హారతి కార్యక్రమాల గురించి సమీక్షలో చర్చించారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి లోగా పూర్తి చేయాలని నిర్దేశించారు.ట్విన్ టన్నెల్స్ లైనింగ్ పనులు 77 , అప్రోచ్ చానల్ ఎర్త్ వర్క్ పనులు 98 శాతం, హెడ్ రెగ్యులేటర్ కాంక్రీట్ పనులు 71 శాతం, ఇరిగేషన్ టన్నెల్ లైనింగ్ 76 శాతం పూర్తైనట్టు అధికారులు సీఎంకు వివరించారు. కేఎల్ బండ్ ఎర్త్ వర్క్, ఎంబార్క్మెంట్ పనులు ఈ ఏడాది జూన్ కల్లా పూర్తి చేస్తామని వివరించారు. ఆర్ అండ్ ఆర్ కి సంబంధించి 49 కాలనీలు ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి, మరో 20 కాలనీలు 2027 ఏప్రిల్ కల్లా పూర్తి చేయనున్నట్టు వెల్లడించారు. మొదటి దశలో మొత్తం 38,060 నిర్వాసిత కుటుంబాలకు, ఇప్పటివరకు 16,763 కుటుంబాల తరలించాం.ఈ ఏడాది ఆగస్ట్ నాటికి 8,518 కుటుంబాలు, 2027 ఏప్రిల్కు 12,779 కుటుంబాలు తరలించాలని సీఎం సూచించారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.27,089 కోట్లు వ్యయం అయినట్టు వెల్లడించారు. మరో రూ.5,108 కోట్లతో సివిల్, ఆర్ అండ్ ఆర్ పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు. వెలిగొండ స్టేజ్ 1కు సంబంధించి హెడ్ రెగ్యులేటర్ కాంక్రీట్ పనులు 74 శాతం, టన్నెల్ 2 బెంచింగ్ 94 శాతం, లైనింగ్ 66 శాతం, ఫీడర్ కెనాల్ రిటైనింగ్ వాల్ కాంక్రీట్ 84 శాతం, లైనింగ్ 8 శాతం పూర్తి అయింది. పురోగతిలో తీగలేరు కెనాల్ హెడ్ రెగ్యులేటర్ గేట్లు, ఈస్ట్రన్ మెయిన్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్, డైవర్షన్ రోడ్ పనులు కొనసాగుతున్నాయి. మొత్తం వెలిగొండ పనులు జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం, దీనికి రూ.2,042 కోట్లు వ్యయం కానుందని అంచనా వేస్తున్నామని అన్నారు.

## కర్ణాటక ప్రజలతో ప్రమాణం చేయించిన ప్రధాని మోదీ..

న్యూ ఢిల్లీ, ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటక ప్రజలతో ప్రమాణం చేయించారు. దేశం అభివృద్ధి చెందాలంటే తాను చెప్పే తొమ్మది పనులు చేయాలని, ఆ తొమ్మిది పనులు చేస్తామని ప్రమాణం చేయాలని ఆయన కోరారు. ఆ మేరకు ప్రజల చేత ప్రమాణం చేయించారు. ఇవాళ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మహా సంస్థాన మఠం ను ప్రధాని సందర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగిస్తూ ప్రజల నుంచి 9 పనులపై హామీ తీసుకున్నారు.'మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు ఆ 9 హామీలు నెరవేరుస్తామని ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతోపాటు దేశ అభివృద్ధి కూడా వేగంగా జరుగుతుంది' అని ప్రధాని మోదీ చెప్పారు. ఆ తర్వాత ఆ 9 పనుల గురించి ప్రజలకు తెలియజేశారు. నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడతామని, పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిస్తామని, అమ్మ పేరుతో మొక్కలు నాటుతామని ప్రజల నుంచి ప్రధాని హామీ తీసుకున్నారు.అదేవిధంగా 'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుతామని, జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేస్తామని, రసాయనాలు లేకుండా పంట సాగు చేస్తామని, ఆహారంలో మిల్లెట్స్‌ను భాగం చేసుకుంటామని, నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిస్తామని, ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుకుంటూ ప్రకృతికి సేవ చేస్తామని ప్రధాని హామీలు పొందారు. ఇలా మొత్తం 9 పనులకు సంబంధించిన హామీలను ప్రధాని తీసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా వైద్యం పొందే అవకాశం కల్పిస్తున్నామని గుర్తుచేశారు.



## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ నియామకం



అమరావతి, ఏప్రిల్ 15 : పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏపీ మంత్రి నారా లోకేశ్‌ని నియమించింది. టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. సీనియర్లకు గౌరవం, కొత్తవారికి అవకాశాలు, సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు చేశామని వెల్లడించారు. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం ఆధారంగా పదవులను ఇవ్వడం జరిగిందన్నారు.నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం చేస్తామని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. పొలిట్ బ్యూరోలో అనూహ్య మార్పులు, ప్రతి కమిటీలోనూ కొత్త వారిని నియమించినట్లు వివరించారు. 29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీలను నియమించినట్లు చెప్పుకొచ్చారు. జాతీయ ప్రధాన కార్యదర్శులు-3, జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-7, రాష్ట్ర ఉపాధ్యక్షులు-16, రాష్ట్ర అధికార ప్రతినిధులు-14, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్లు-10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు-59, రాష్ట్ర కార్యదర్శులు-77, నాలెడ్జి కమిటీ, హెచ్ఆర్డీ కమిటీల్లో ఒక్కొక్కరి చొప్పున నియమించినట్లు వెల్లడించారు.అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై ఏపీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కసరత్తు చేశారని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గతానికి భిన్నంగా పార్టీ కమిటీల కూర్పును సీఎం కొత్త పుంతలు తొక్కించారని వ్యాఖ్యానించారు. గత కొంతకాలంగా చెబుతున్నట్లే టీడీపీ బలోపేతానికి కష్టపడిన వారికి, విధేయులకు పెద్దపీట వేశామని పేర్కొన్నారు. ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్‌చార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తికొండ ధనుంజయ్ చోటు దక్కించుకున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించామని పేర్కొన్నారు.జనాభా దామాషా పద్ధతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు చేసినట్లు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. 185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు టీడీపీ హై కమాండ్ స్థానం కల్పించిందని తెలిపారు. బీసీ-77, ఎస్సీ-25, ఎస్టీ-7, మైనార్టీ-13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినట్లు వివరించారు. బీసీలకు 40 శాతం, ఎస్సీలకు 25 శాతం, ఎస్టీలకు 3.8 శాతం, మైనార్టీలకు 7 శాతం చొప్పున కమిటీలో టీడీపీ అధినాయకత్వం స్థానం కల్పించిందని అన్నారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి కమిటీల కూర్పు చేశామని తెలిపారు. పార్టీకి యువ నాయకత్వం అందుబాటులోకి వచ్చేలా నియమకాలు చేపట్టామని అన్నారు. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ, 33 శాతం మహిళా రిజర్వేషన్లను దృష్టిలో పెట్టుకొని కసరత్తు చేశామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు పెద్దపీట వేస్తూ కమిటీల కూర్పు చేశామని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల..

### 12 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా పాస్ పర్సంటేజ్ నమోదు

ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఫలితాల కోసం ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ సంప్రదించాలని సూచించారు.ఇంటర్ ఫస్టియర్‌లో 5,10,307 మంది, సెకండియర్‌లో 5,05,609 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో ప్రథమ సంవత్సరంలో 77 శాతం, ద్వితీయ సంవత్సరంలో 81 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గత 12 సంవత్సరాల్లో ఎన్నడూలేని విధంగా అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారని నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.కాగా, ఏపీ ఇంటర్ ఫలితాల్లో కృష్ణా జిల్లాలో అత్యధికంగా ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ జిల్లాలో 92 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఆ తర్వాత గుంటూరులో 88 శాతం, ఎన్టీఆర్ జిల్లాలో 87 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఇక అన్నమయ్య జిల్లాలో అత్యల్ప ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ జిల్లాలో కేవలం 62 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

మే 21 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మే 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. జూన్ 4వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ఆయా తేదీల్లో రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇంటర్ ప్రాక్టికల్స్ జూన్ 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయి.

## బిహార్‌లో ముగిసిన నితీష్ యుగం..

### సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సమ్రాట్ చౌదరి



పాట్నా, ఏప్రిల్ 15: బిహార్ రాజకీయాల్లో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసింది. దాదాపు రెండు దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని పాలించిన నితీష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయడంతో, భారతీయ జనతా పార్టీ (ఃఏఖ)కి చెందిన బలమైన నేత సమ్రాట్ చౌదరి బిహార్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే (ఔఆం) ఘనవిజయం సాధించిన తర్వాత, నితీష్ కుమార్ రికార్డు స్థాయిలో 10వ సారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అయితే, అనూహ్య పరిణామాల మధ్య ఆయన క్రియాశీల రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకుని రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో బిహార్‌లో నితీష్ కుమార్ యుగం ముగిసి, బీజేపీ నేతృత్వంలోని సరికొత్త అధ్యాయం మొదలైంది. బిహార్‌కు బీజేపీ నుంచి ముఖ్యమంత్రి కావడం ఇదే తొలిసారి57 ఏళ్ల సమ్రాట్ చౌదరి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి శకుని చౌదరి ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. తల్లి పార్వతీ దేవి కూడా ఎమ్మెల్యేగా సేవలందించారు. 1990లలో ఆర్జేడీ (ఖీఏఆ) ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన సామ్రాట్, 2018లో బీజేపీలో చేరారు. 2023లో బీహార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, 2024లో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. నితీష్ కుమార్‌ను అధికారం నుంచి దించే వరకు తాను తలపాగా (మురేఠా) తీయనని 2022లో ఆయన బహిరంగంగా శపథం చేశారు. నేడు నితీష్ స్థానంలో ఆయనే ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించు కోవడం గమనార్హం.బిహార్‌లో వెనుకబడిన తరగతుల (ాఃఅ), ముఖ్యంగా కోయిరీ/కుష్వాహ సామాజిక వర్గాల్లో సమ్రాట్ చౌదరికి మంచి పట్టు ఉంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, సామాజిక సమీకం´ణాలను బ్యాలెన్స్ చేస్తూ బీజేఎసమ్రాట్ చౌదరి సీఎంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఆయనకు అభినందనలు తెలిపారు.




# సంపాదకీయం

గురువారం 16-04-2026

## హైబ్రీడ్ మోడల్ సాధ్యమా....

లోక్‌సభ సీట్ల సంఖ్యను భారీగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 850కి పెంచాలని ప్రతిపాదిస్తూ కేంద్రం గురువారం నాడు బిల్లులను ప్రవేశపెట్టనుంది. ఇందులో భాగంగా రాష్ట్రాల నుండి 815 సీట్లు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 35 సీట్లు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. రెండు వారాలుగా ఈ విషయంపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు సాగుతుండగా, ఎంపీలకు ఈ ముసాయిదా చట్టం ప్రతులను పంపిణీ చేయడంతో ఈ ప్రక్రియ అధికారికంగా ముందడుగు పడింది. రాజ్యాంగంలోని అధికరణ 82 ప్రకారం, ప్రతి జనాభా గణన తర్వాత రాష్ట్రాలకు కేటాయించే లోక్‌సభ సీట్లను జనాభా మార్పులకు అనుగుణంగా సర్దుబాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల విభజన 1971 జనాభా గణన ఆధారంగా జరిగింది. 2001లో చేసిన 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం, 2026 తర్వాత జరిగే మొదటి జనాభా గణన వరకు నియోజకవర్గాల సరిహద్దుల మార్పుపై నిషేధం ఉంది. అయితే, తాజా బిల్లులో ఈ నిబంధనను సవరించి, 2011 జనాభా గణన ఆధారంగానే ఈ పునర్విభజన ప్రక్రియను చేపట్టాలని కేంద్రం భావిస్తోంది.మహిళా రిజర్వేషన్ల అమలుతో ఈ డిలిమిటేషన్ ప్రక్రియ ముడిపడి ఉండటం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33% సీట్లు కేటాయించాల్సి ఉంది. అయితే ఇది జనాభా గణన మరియు డిలిమిటేషన్ తర్వాతే సాధ్యమని ప్రభుత్వం గతంలో పేర్కొంది. తాజా ప్రతిపాదనల ప్రకారం సీట్ల సంఖ్యను 850కి పెంచితే, అందులో సుమారు 270 సీట్లు మహిళలకు రిజర్వ్ అవుతాయి. లోక్‌సభ స్థానాలను దాదాపు 50 శాతం పెంచాలన్న ప్రతిపాదనపై కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. ఈ ప్రక్రియ కేవలం అంకగణితంలా కాకుండా రాజకీయంగా అందరికీ సమన్యాయం చేసేలా ఉండాలని కోరింది. ముఖ్యంగా జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలు, కేవలం జనాభా తక్కువగా ఉందన్న కారణంతో పార్లమెంట్‌లో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోకూడదని సోనియా గాంధీ అభిప్రాయపడ్డారు. ఉత్తరాది రాష్ట్రాలలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్నందున, సీట్ల పెంపు వల్ల వారికి అదనపు లబ్ధి చేకూరితే దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కినట్లు అవుతుందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పొడిగించిన ప్రభుత్వం, ఈ మూడు రోజుల ప్రత్యేక వ్యవధిలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి లాంటి నేతలు ప్రతిపాదిస్తున్న హైబ్రీడ్ మోడల్, రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తి మారకుండా సీట్లు పెంచే వ్యూహాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందో లేదో వేచి చూడాలి. ఏది ఏమైనా, దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చేసే ఈ డిలిమిటేషన్ ప్రక్రియపై ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోంది. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ స్థానాలను పెంచే ప్రక్రియను వేగవంతం చేస్తున్న తరుణంలో, స్టాలిన్ దీనిపై తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు.ముఖ్యమంత్రి స్టాలిన్ తన తాజా వీడియో సందేశంలో కేంద్ర ప్రభుత్వానికి తుది హెచ్చరించారు. కేవలం జనాభా ప్రాతిపదికన డిలిమిటేషన్ చేపడితే, దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది కేవలం బెదిరింపు కాదు.. తమిళనాడు ఎన్నడూ చూడని రీతిలో ఒక మహా ఉద్యమాన్ని చూస్తారు. ప్రతి కుటుంబం వీధిలోకి వస్తుంది, రాష్ట్రం మొత్తం స్తంభిస్తుంది అని ఆయన ఘాటుగా హెచ్చరించారు. 1950, 60లలో హిందీ వ్యతిరేక ఉద్యమాల సమయంలో డీఎంకే చూపిన ఉధృతిని మరోసారి దేశం చూస్తుందని ఆయన సంకేతాలిచ్చారు.తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించి జనాభాను నియంత్రించాయని, ఇప్పుడు జనాభా తక్కువగా ఉందని పార్లమెంట్‌లో సీట్లు తగ్గించడం అంటే అభివృద్ధి చెందిన రాష్ట్రాలను శిక్షించడమేనని స్టాలిన్ వాదిస్తున్నారు. జనాభా పెంచుకున్న రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు ఇచ్చి, నియంత్రించిన రాష్ట్రాలకు అన్యాయం చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఇది సమాఖ్య స్ఫూర్తిపై దాడి అని, దక్షిణాదిని రాజకీయంగా బలహీనపరిచే కుట్రని స్టాలిన్ అంటున్నారు. ఇండియా కూటమిలో కీలక సభ్యుడైన స్టాలిన్, ఈ విషయంలో కూటమి యొక్క గొంతుకగా మారారు. డిలిమిటేషన్ అనేది కేవలం అంకెల గారడీ కాకూడదని, అది రాజకీయ సమానత్వం కల్పించేలా ఉండాలని కూటమి డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రీడ్ మోడల్ జనాభాతో పాటు జిఎస్‌డిపిని పరిగణనలోకి తీసుకోవడం పై కూటమిలో చర్చ జరుగుతోంది. రాష్ట్రాల మధ్య ఉన్న ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్తే తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని కూటమి స్పష్టం చేసింది.మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలంటే డిలిమిటేషన్ తప్పనిసరి అని కేంద్రం చెప్పడాన్ని స్టాలిన్ తప్పుబడుతున్నారు. మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ ఆ పేరుతో దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటాను తగ్గించే ప్రయత్నాన్ని సహించబోమని ఆయన స్పష్టం చేశారు. మహిళా కోటాను నియోజకవర్గాల పెంపుతో సంబంధం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన, స్టాలిన్ హెచ్చరికలతో ఈ డిలిమిటేషన్ అంశం కేవలం తమిళనాడుకు పరిమితం కాకుండా మొత్తం దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి సమస్యగా మారుతోంది. ఇప్పటికే కేరళ, కర్ణాటక నేతలతో స్టాలిన్ సంప్రదింపులు జరుపుతున్నారు. కేంద్రం ఏకపక్షంగా ముందడుగు వేస్తే, ఉత్తరాది వర్సెస్ దక్షిణాది అనే భావన దేశ సమగ్రతకు భంగం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


## నాటో కూటమి గతంలో లేదు.. భవిష్యత్తులో కూడా ఉండదు : డొనాల్డ్ ట్రంప్



ఇరాన్ తో యుద్ధం చేసే విషయంలో, హర్మూజ్ జలసంధి ని తిరిగి తెరిపించే విషయంలో నాటో కూటమి నుంచి ఎలాంటి సాయం అందకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ కూటమిపై ఇప్పటికే అనేకసార్లు విరుచుకుపడిన ఆయన.. తాజాగా మరోసారి ట్రూత్ సోషల్ వేదికగా విమర్శలు చేశారు. నాటో అమెరికాకు ఎప్పుడూ మద్దతుగా నిలువలేదని మండిపడ్డారు.అమెరికాకు అవసరమైనప్పుడు ఎప్పుడూ నాటో కూటమి అండగా లేదని, భవిష్యత్తులోనూ దాని నుంచి తమకు ఎలాంటి మద్దతు లభించదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ దృష్టిలో నాటో కూటమి గతంలో లేదు, భవిష్యత్తులో ఉ ండబోదని అసహనం వ్యక్తంచేశారు. కాగా గత కొన్నిరోజులుగా నాటోపై ట్రంప్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఇటీవల కూడా నాటో కూటమిని ఒక కాగితపు పులిగా అభివర్ణించారు. కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు సంచలన ప్రకటన చేశారు. మరోవైపు అమెరికాలో జన్మించిన తొలి పోప్ లియో-14 అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య జగడం మరింత ముదురుతోంది. పోప్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ మంగళవారం ఓ పోస్టు పెట్టారు. గత రెండు నెలల్లో ఇరాన్ దాదాపు 42 వేల మంది అమాయకులైన నిరసనకారులను బలిగొన్నదని ట్రంప్ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ దేశం వద్ద అణ్వాయుధాలు ఉండటం సరైనది కాదని ఉద్ఘాటించారు. ఈ విషయం పోప్ లియోకు అర్థమయ్యేలా ఎవరైనా చెప్పాలంటూ ఎద్దేవా చేశారు.పశ్చిమాసియా యుద్ధంపై పోప్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఘాటుగా స్పందించారు. దాంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. నాటో నుంచి వైదొలిగే యోచనలో ఉ న్నట్లు ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. యూరప్ ప్లాన్ బీపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ అమెరికా కూటమి నుంచి వైదొలిగితే.. ప్రస్తుత సైనిక వ్యవస్థలను ఉపయోగించి తనను తాను రక్షించుకోగలిగే ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను యూరప్ రూపొందిస్తున్నదని మీడియాలో కథనాలు వస్తున్నాయి. 'యూరోపియన్ నాటో' పేరుతో ఈ ప్రతిపాదనపై అధికారులు కృషి చేస్తున్నట్లు కథనాలు వెలువడ్డాయి.

## బరువు తగ్గించే జీఎల్‌పీ-1 ఔషధాలు.. డాక్టర్ల సలహా లేకుండా వాడొద్దు..

న్యూ ఢిల్లీ, ఈ ఏడాదిలో బరువు తగ్గించే చికిత్సల ప్రపంచంలో ఒక కీలక మలుపు వచ్చింది. టైప్-2 డయాబెటిస్ కోసం అభివృద్ధి చేసిన సెమాగ్లూటైడ్ ఔషధం, బరువు తగ్గడంలో చూపిన ఫలితాల వల్ల ప్రపంచవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు ఈ ఔషధంపై పేటెంట్ గడువు మార్చిలో ముగియడంతో దేశంలో పదుల సంఖ్యలో జనరిక్ బ్రాండ్లు మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చాయి. దీని వల్ల ధరలు తగ్గి, మరింత మంది ఈ చికిత్సను పొందుతున్నారు. అయితే ఒబెసిటీ (అధిక బరువు) గురించి సరైన అవగాహన అవసరం. ఇది కేవలం ఎక్కువ తినడం లేదా అలసత్వం వల్ల వచ్చే సమస్య కాదు. ఒబెసిటీ ఒక దీర్ఘకాలిక మెటబాలిక్ వ్యాధి. ఇది డయాబెటిస్, హైపర్‌టెన్షన్, డిస్లిపిడీమియా వంటి వ్యాధులలాగా తీవ్రమైనది. ఈ పరిస్థితి శరీర ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది.ఒబెసిటీ ఉన్నవారికి 200కి పైగా ఆరోగ్య సమస్యల ప్రమాదం ఉంటుంది. ఇవి ప్రధానంగా నాలుగు వర్గాల్లో ఉంటాయి. మెటబాలిక్ సమస్యలు ? టైప్-2 డయాబెటిస్, హై బీపీ, ఫ్యాటీ లివర్, మెకానికల్ సమస్యలు ? కీళ్ల నొప్పులు, స్లీప్ అప్నియా, ఆమ్లత్వం, మానసిక సమస్యలు ? ఆత్మవిశ్వాసం తగ్గడం, సామాజిక ఆందోళన, ఆర్థిక సమస్యలు ? వైద్య ఖర్చులు పెరగడం, పనితీరు తగ్గడం. సరైన చికిత్సతో ఈ సమస్యలను ముందుగానే నివారించవచ్చు.సెమాగ్లూటైడ్ అనేది ఉఒఖ-1 రిసెప్టర్ అగోనిస్ట్ అనే ఔషధ వర్గానికి చెందినది. ఇది శరీరంలో సహజంగా విడుదలయ్యే ఉఒఖ-1 హార్మోన్‌ను అనుకరిస్తుంది. ఈ హార్మోన్ రక్తంలో చక్కెర స్థాయిలని నియంత్రించడమే కాకుండా ఆకలిని తగ్గించి తృప్తి భావాన్ని పెంచుతుంది. అందుకే ఇది బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఈ ఔషధం మొదట డయాబెటిస్ కోసం ఉపయోగించినప్పటికీ, తర్వాత బరువు తగ్గడంలో కూడా ఉపయోగకరమని గుర్తించి కొన్ని బ్రాండ్ల పేర్లతో దీనికి అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం దీన్ని ఆఫ్-లేబుల్‌గా కూడా విస్తృతంగా వాడుతున్నారు. పేటెంట్ ముగియడంతో జనరిక్ ఔషధాలు అందుబాటులోకి రావడం వల్ల దీని వినియోగం మరింత పెరిగింది. అయితే ఇది వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే వాడాల్సి ఉంటుంది.సెమాగ్లూటైడ్ బరువు తగ్గడంలో అనేక విధాలుగా పనిచేస్తుంది. ఇది ఆకలిని తగ్గిస్తుంది, అధిక కేలరీల ఆహారాలపై ఆకర్షణను తగ్గిస్తుంది, పొట్ట ఖాళీ కావడాన్ని నెమ్మదిస్తుంది, ఎక్కువసేపు తృప్తి భావాన్ని కలిగిస్తుంది. కొంతమంది రోగుల్లో మద్యపానం, పొగ తాగడం వంటి అలవాట్లు కూడా తగ్గినట్లు గమనించారు. ఇది మాత్రమే సరిపోదని నిపుణులు చెబుతున్నారు. సరైన ఆహార నియంత్రణ, వ్యాయామం కూడా తప్పనిసరి. దీర్ఘకాలిక ఫలితాల కోసం జీవనశైలిలో మార్పులు అవసరం. సెమాగ్లూటైడ్ వల్ల బరువు తగ్గడమే కాకుండా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉ న్నాయి. ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గడం, రక్తపోటు తగ్గడం, కొలెస్ట్రాల్ స్థాయిలు మెరుగుపడడం, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గడం వంటి ప్రయోజనాలు కనిపించాయి. కిడ్నీ రక్షణ, ఫ్యాటీ లివర్ సమస్యలలో కూడా ఇది సహాయపడుతుంది. అల్జీమర్స్ వంటి నాడీ సంబంధిత వ్యాధులపై కూడా పరిశోధనలు కొనసాగుతున్నాయి.అయితే ఈ ఔషధానికి కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. వాంతులు, మలబద్ధకం లేదా విరేచనాలు, తలనొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. సాధారణంగా తక్కువ మోతాదుతో ప్రారంభించి క్రమంగా పెంచితే ఇవి నియంత్రణలో ఉంటాయి. అలాగే కొన్ని పరిస్థితుల్లో ఈ ఔషధాన్ని వాడకూడదు. టైప్-1 డయాబెటిస్, ప్యాంక్రియాటైటిస్ చరిత్ర, గాల్‌బ్లాడర్ రాళ్లు, కొన్ని కంటి సమస్యలు, గ్యాస్ట్రోపారెసిస్, థైరాయిడ్ క్యాన్సర్ చరిత్ర ఉ న్నవారు దీన్ని వాడకూడదు. అయితే సెమాగ్లూటైడ్ ఒబెసిటీ చికిత్సలో కీలక మార్పును తీసుకువస్తుంది. కానీ ఇది ఒక తక్షణ పరిష్కారం కాదు. సరైన వైద్యుల మార్గదర్శకత్వంలో, జీవనశైలిలో మార్పులతో కలిపి వాడితేనే దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందవచ్చు.




## ఫెమా ఉల్లంఘన ఆరోపణలు.. ఆప్ ఎంపీ ఇల్లు, వ్యాపార సంస్థలపై ఈడీ దాడులు

ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాజ్యసభ సభ్యుడు అశోక్ కుమార్ మిట్టల్ నివాసం, వ్యాపార సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇవాళ ఉదయం ఏకకాలంలో సోదాలు మొదలుపెట్టింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టాన్ని ఉ ల్లంఘించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టినట్లు ఈడీ అధికారులు తెలిపారు. ఈ సోదాలపై వివరణాత్మక ప్రకటనను త్వరలో ఎల్లడిస్తామని అన్నారు.వ్యాపారవేత్త, విద్యావేత్త అయిన అశోక్ కుమార్ మిత్తల్ లవ్లీ గ్రూప్‌కు అధిపతిగా ఉన్నారు. ఈ గ్రూప్ ఒక యూనివర్సిటీ సహా పలు వ్యాపార సంస్థలను నడుపుతోంది. ఈ వ్యాపారాలకు సంబంధించి ఆయన ఫెమా నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉ న్నాయి. ఈ నేపథ్యంలో ఆయన నివాసంపైన, ఆయనకు సంబంధించిన వ్యాపార సంస్థలపైన ఈడీ ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నది. అశోక్ మిత్తల్ రాజ్యసభలో ఆప్ ఉపనేతగా ఎన్నికైన కొన్ని రోజులకే ఈడీ సోదాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.కాగా, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటులో గళమెత్తడానికి తమ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా భయపడుతున్నారనే కారణంతో ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ ఆయనను రాజ్యసభలో తమ పార్టీ ఉపనేత స్థానం నుంచి తొలగించింది. ఆయన స్థానంలో పంజాబ్ ఎంపీ అశోక్ కుమార్ మిత్తల్‌ను నియమించింది. ఈ నియామకం జరిగిన కొద్ది రోజులకే ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. జలంధర్, చండీగఢ్ విభాగాలకు చెందిన ఈడీ అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నారు.



## వందేమాతరం పాడని ఇద్దరు కార్పొరేటర్లపై ఎఫ్‌ఐఆర్ నమోదు



ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ మున్సిపాల్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు.. వందేమాతరం గీతాన్ని ఆలపించని విషయం తెలిసిందే. మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం సమయంలో జాతీయ గీతం వందేమాతరాన్ని పాడేందుకు నిరాకరించారు. ఏప్రిల్ 8వ తేదీన ఈ ఘటన జరిగింది. కాంగ్రెస్ కార్పొరేటర్ ఫౌజియా షేక్ ఆలిమ్ వందేమాతర గీతం పాడేందుకు వ్యతిరేకించారు. ఇస్లామిక్ విశ్వాసాల ప్రకారం ఆ పాట పాడలేనని చెప్పిందామె. మరో కాప్పొరేటర్ రూబినా ఇక్బాల్ ఖాన్ కూడా ఫౌజియాకు మద్దతు పలికింది. స్వతంత్ర్య కార్పొరేటర్‌గా గెలిచిన రూబినా ఆ తర్వాత కాగ్రెస్ పార్టీలో చేరారు.ఆ ఇద్దరు జాతీయ గీతాన్ని ఆలపించేందుకు నిరాకరించారు. బీజీరోడ్డ పోలీసు స్టేషన్‌లో 196 బీఎన్ఎస్ సెక్షన్ కింద ఫౌజియా, రుబినాపై కేసు నమోదు అయ్యింది. ఆ ఇద్దరికీ సమన్లు ఇచ్చిన పోలీసులు గడిచిన రెండు రోజుల పాటు వారిని విచారించారు. వారి వద్ద నుంచి వాంగ్మూలం తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. కాగ్నిజల్ అఫెన్స్‌గా భావిస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. సమగ్రరీతిలో ఈ కేసును విచారిస్తున్నట్లు చెప్పారు.

## సింగరేణి డిస్పెన్సరీలో తాగునీటి కటకటా.. మూడు నెలలుగా మూలన పడిన ప్యూరిఫైడ్ యంత్రం



రామగిరి, ఏప్రిల్ 15 : సింగరేణి అర్జీ డివిజన్‌లోని సెంటినరీ కాలనీలో ఉ న్న అర్జీ-3 డిస్పెన్సరీలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గత మూడు నెలలుగా ప్యూరిఫైడ్ వాటర్ యంత్రం పనికిరాకుండా మూలన పడివుండగా దానిని మరమ్మతు చేయడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డిస్పెన్సరీలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, ఉద్యోగులు, అలాగే చికిత్స కోసం వచ్చే కార్మికులు వారి కుటుంబ సభ్యులు త్రాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో నీటి అవసరం పెరిగినా, సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన లేకపోవడం వల్ల పరిస్థితి మరింత దిగజారిందని తెలిపారు. తక్షణమే ప్యూరిఫైడ్ వాటర్ యంత్రాన్ని మరమ్మతు చేసి, తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, డిస్పెన్సరీలో తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

## ఏఐటియూసీ జిల్లా మహాసభలు విజయవంతం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15 - ఏఐటియూసీ నంద్యాల జిల్లా ప్రథమ మహాసభలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. నందికొట్కూరులో జరిగిన ఈ మహాసభల్లో భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించి అనంతరం ప్రతినిధుల సమావేశంలో కార్మిక సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు.ఈ సందర్భంగా నూతన జిల్లా సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా వి. రఘురామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా పి. సుంకయ్య ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా శ్రీశైలం నాగిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అబ్బాస్, ఉపాధ్యక్షులుగా ఎస్. జ్యులేఖ, ఓబులేష్, వేదవతి, డిప్యూటీ కార్యదర్శిగా ఎం. రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి. బాలకృష్ణ, సహాయ కార్యదర్శులుగా పుల్లయ్య, డి. శ్రీనివాసులు, కోశాధికారిగామ్మ ధనుంజయ ఎన్నికైనట్లు తెలిపారు. మొత్తం 11 మంది ఆఫీస్ బేరర్లు, 55 మంది జిల్లా కమిటీ సభ్యులు ఎంపికయ్యారు.మహాసభల్లో అంగన్వాడి, ఆశా, మధ్యాహ్న భోజన, భవన నిర్మాణ, ఆటో, హమాలీ, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం, కనీస వేతనాల అమలు, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై తీర్మానాలు చేశారు. అలాగే స్థానికులకు పరిశ్రమల్లో 80 శాతం ఉద్యోగాలు కల్పించాలని, కార్మిక సంక్షేమ బోర్డులను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.త్వరలో తిరుపతిలో జరిగే రాష్ట్ర మహాసభలకు కార్మికులను పెద్ద సంఖ్యలో తరలించాలని నిర్ణయించారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ఉద్యమాలు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య, ఎస్. మునెప్ప, లలితమ్మ, సిపిఐ నాయకులు కె. రామాంజనేయులు, ఎన్. రంగనాయుడు, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.



# రాజ్యసభకు ఊహించని పేర్లు

విజయవాడ, ఏప్రిల్ 15 ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి ప్రారంభం అయింది. ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు రాజ్యసభ సభ్యులు జూన్ 21న పదవీ విరమణ చేయనున్నారు. అందుకే ఇప్పుడు ఎన్నికల కమిషన్ వారి స్థానంలో కొత్త వారి ఎన్నికల కోసం నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధపడింది. కూటమికి ఏకపక్షంగా బలం ఉండటంతో.. వారి ఖాతాలోనే ఈ నాలుగు రాజ్యసభ స్థానాలు పడనున్నాయి. అయితే ఆశావహులు చాలామంది ఉన్నారు. కానీ 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అభ్యర్థుల ఎంపిక కు శ్రీకారం చుట్టింది కూటమి. అయితే అన్ని పార్టీల్లోనూ ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. కానీ ఈసారి కొత్త వారికి ఛాన్స్ ఇస్తారని ప్రచారం నడుస్తోంది. అదే సమయంలో సీనియర్లు సైతం పదవులు ఆశిస్తున్నారు.ఏపీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వానీ, సానా సతీష్ పదవి విరమణ చేయనున్నారు. అయితే ఇందులో సతీష్ టీడీపీకి చెందిన నేత. ఏడాది కిందట ఆయన రాజ్యసభకు ప్రమోట్ అయ్యారు. అప్పట్లోనే మరోసారి రెన్యువల్ ఇస్తామని టిడిపి నాయకత్వం హామీ ఇచ్చింది. అయితే ఇప్పుడు టిడిపికి రెండు.. జనసేన, బిజెపికి చెరో ఒక రాజ్యసభ పదవి ఇస్తామన్న ఒప్పందం పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన టిడిపికి రెండు పదవులు దక్కనున్నాయి. అందులో ఒక్కటి సానా సతీష్ కు ఖరారు అయింది. మిగతా పదవి కోసం పార్టీలో చాలామంది ఆశావహులు ఉ న్నారు. అనూహ్యంగా భారత్ బయోటెక్ అధిపతి ఎల్లా కృష్ణా పేరు వినిపిస్తోంది. మరోవైపు గల్లా జయదేవ్ సైతం రేసులో ఉన్నారు. యనమల రామకృష్ణుడు తో పాటు వర్ల రామయ్య పేరు కూడా వినిపిస్తోంది. జూనియర్ కోటాలో చింతకాయల విజయ్ సైతం రాజ్యసభ పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.జనసేనకు సంబంధించి అనేక పేర్లు వస్తున్నాయి. అయితే ఆది నుంచి ప్రముఖంగా వినిపించిన పేరు లింగమనేని రమేష్. ప్రముఖ పారిశ్రామిక వ్యాప్తంగా ఉన్న ఆయన 2024 ఎన్నికల్లో జనసేనకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. పైగా సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు కూడా. అయితే మరోవైపు అల్లు అరవింద్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. కానీ మొగ్గు మాత్రం లింగమనేని రమేష్ వైపు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పవన్ కళ్యాణ్ నిర్ణయం పై ఆధారపడి ఉంటుంది. తొలి రాజ్యసభ పదవి జనసేనకు. అందుకే పవన్ కళ్యాణ్ ఆచితూచి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.భారతీయ జనతా పార్టీ ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందా అనే చర్చ నడుస్తోంది. అయితే రాష్ట్రం నుంచి ఆ పార్టీలో ఆశావహులు చాలామంది ఉన్నారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే ఏపీ నుంచి తమిళనాడు రాష్ట్రానికి చెందిన నేత అన్నామలైను రాజ్యసభకు పంపిస్తారన్న ప్రచారం ఉంది. ప్రస్తుత తమిళనాడు ఎన్నికల్లో అన్నామలై పోటీ చేయడం లేదు. అందుకే ఏపీ నుంచి రాజ్యసభ పదవి ఇచ్చి ఆయనను క్యాబినెట్ లోకి తీసుకుంటారన్న టాక్ నడుస్తోంది. మరోవైపు పారిశ్రామిక కోటాలో పరిమళ్ నత్వానికి మరో ఛాన్స్ ఉంటుందన్న ప్రచారం కూడా ఉంది. మరి ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయో చూడాలి.

# డీలిమిటేషన్ లెక్క ఇదేనా

విజయవాడ, ఏప్రిల్ 15, నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఏప్రిల్ 16న డీలిమిటేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. బిల్లులో చేసిన ప్రతిపాదన ప్రకారం దేశవ్యాప్తంగా ఎంపీ సంఖ్య 850కి పెరగనుంది. లోక్‌సభ సీట్లతో పాటుగా రాష్ట్రాలలో ఎమ్మెల్యేల సీట్లు కూడా పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలో ఎన్ని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు పెరుగుతాయనేదీ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 16వ తేదీన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుండటంతో ఈ అంశం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశమైంది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో చేసిన ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలను 815 వరకు పెరగనున్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లోని లోక్‌సభ స్థానాల సంఖ్య 35 వరకు పెరిగే అవకాశం ఉంది. దీంతో లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850 వరకూ పెరగొచ్చని సమాచారం. ఇదే సమయంలో ఎంపీ సీట్లతో పాటుగా రాష్ట్రాలలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎమ్మెల్యే సీట్లు ఎంతకు పెరగవచ్చునేదీ ఆసక్తికరంగా మారింది.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సామర్థ్యం ప్రస్తుతం 175గా ఉంది. అయితే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఏపీలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 175 నుంచి 263కు పెరుగుతుందని అంచనా. ప్రస్తుతం ఉన్న స్థానాలకు 88 సీట్లు అదనంగా పెరగవచ్చని తెలుస్తోంది. అలాగే మొత్తం శాసనసభ స్థానాలలో 87 సీట్లు మహిళలకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. లోక్‌సభ స్థానాల విషయానికి వస్తే ఏపీలో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్ల సంఖ్య 25. డీలిమిటేషన్ తర్వాత ఈ సంఖ్య 37 లేదా 38కి పెరగవచ్చని అంచనా. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే ఇందులో 12 నుంచి 13 ఎంపీ సీట్లు మహిళలకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.అలాగే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఏపీలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే స్థానాల సంఖ్య కూడా పెరగనుంది. ప్రస్తుతం ఏపీలో 29 శాసనసభ స్థానాలు ఎస్సీలకు రిజర్వ్ చేశారు. అలాగే ఎస్టీలకు7 శాసనభ స్థానాలు కేటాయించారు. తిరుపతి, చిత్తూరు, బాపట్ల, అమలాపురం లోక్‌సభ స్థానాలను ఎస్సీలకు, అరకు లోక్‌సభ సీటును ఎస్టీలకు రిజర్వు చేశారు. అయితే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఈ సంఖ్య పెరిగేందుకు అవకాశం ఉంది. అలాగే మంత్రిమండలి సంఖ్య కూడా 26 నుంచి 39కి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

# శ్రీహరి అరెస్టును ఖండించిన ఎన్టీఆర్ జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్

మాజీ ముఖ్యమంత్రి జగన్ గారి సి.పి.ఆర్.ఒ శ్రీహరి అరెస్టును ఎన్టీఆర్ జిల్లా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ కక్షసాధింపుల నేపథ్యంలోనే శ్రీహరి పై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం జరుగుతోందని విమర్శించారు. సోషల్ మీడియా లో పోస్ట్ చేసిన ఫోటోల ఆధారంగా చిత్తూరులో కేసు నమోదు చేసి, నేడు పోలీసులు శ్రీహరిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.ప్రజాస్వామ్యంలో అభిప్రాయాలను వ్యక్తపరచడం ప్రతి ఒక్కరి హక్కు అని, ఆ హక్కును అణచివేయడానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించడం సరైంది కాదని పేర్కొన్నారు. వైస్సార్సీపీ నేతలు, కార్యకర్తలపై ఇలాంటి చర్యలు కొనసాగితే ప్రజలు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు.ఈ అరెస్టును తక్షణమే వెనక్కి తీసుకొని, శ్రీహరి ని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# సింహాచలం భక్తుల భద్రత కోసం ఏఐ

విశాఖపట్టణం, ఏప్రిల్ 15 సింహాచలం అప్పన్న ఆలయంలో చందనోత్సవానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఏప్రిల్ 20న చందనోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత.. ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే భక్తుల భద్రత కోసం తొలిసారిగా ఏఐ వినియోగించనున్నట్లు అనిత తెలిపారు. సీసీటీవీ కెమెరాల ద్వారా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.సింహాచలం చందనోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. సింహాచలం అప్పన్న ఆలయంలో ఏప్రిల్ 20వ తేదీన చందనోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అప్పన్న నిజరూప దర్శనం టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులలో భక్తులకు నిజరూప దర్శనం టికెట్లు జారీ చేస్తున్నారు. చందనోత్సవానికి ఈ ఏడాది సుమారుగా రెండు లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. భక్తుల భద్రత కోసం సింహాచలం ఆలయంలో తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించాలని అధికారులు నిర్ణయించారు.మరోవైపు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవం సందర్భంగా సింహగిరిపై భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం పరిశీలించారు. ఈ ఏడాది సుమారు 2 లక్షల మంది భక్తులు స్వామివారి నిజరూప దర్శనం కోసం వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో.. సామాన్య భక్తుల దర్శనానికి పెద్దపీట వేయనున్నట్లు అనిత తెలిపారు. ఆరోజు తెల్లవారుజామున మూడు గంటల నుంచే సింహాచలం ఆలయంలో దర్శనాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. భక్తుల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు తొలిసారిగా ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు వంగలపూడి అనిత వెల్లడించారు.అలాగే ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సింహాచలం కొండపై పది చోట్ల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని.. నిరంతరాయంగా మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి అనిత తెలిపారు.రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. అత్యవసర సేవల కోసం ఎన్డీఆర్ఎఫ్ , ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ఆలయం వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, స్వామివారి నిజరూప దర్శనం , ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్? హోం మంత్రి వివరించారు. సింహాచలం చందనోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.మరోవైపు చందనోత్సవం సందర్భంగా సింహాచలంలో గంధం అరగతీత కార్యక్రమానికి శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద మంత్రాల సాక్షిగా ఈ ప్రక్రియ ప్రారంభించారు. ఆలయ ఆచారం ప్రకారం గంధం అరగతీత కార్యక్రమం మూడు రోజులు కొనసాగుతుంది. గంధం అరగతీత కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు.

# మతమార్పిడులకు వ్యతిరేకంగా రఘురాముడి గళం

ఏలూరు, ఏప్రిల్ 15, ఏపీ రాజకీయాల్లో రఘురామకృష్ణం రాజు ప్రత్యేకంగా నిలుస్తున్నారు. గత ఏడేళ్ల పాటు ఆయన పేరు పొలిటికల్ వర్గాల్లో వినిపిస్తూ వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారా పార్లమెంట్ సభ్యుడయ్యారు. కొద్ది రోజులకే ఆ పార్టీని విభేదించారు. మొన్నటి ఎన్నికలకు ముందు టిడిపిలో చివరి నిమిషంలో చేరి ఉండి శాసనసభ టికెట్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యే గా గెలిచి డిప్యూటీ స్పీకర్ అయ్యారు. అయితే మతమార్పిడిల నిరోధం అనే అంశాన్ని తన రాజకీయ అజెండాగా మార్చుకున్నట్టు కనిపిస్తున్నారు. గతంలో ఎంపీగా ఉన్న సమయం నుంచి ఈ విషయంపై గళం ఎత్తారు ఆయన. ఇప్పుడు రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూ క్షేత్రస్థాయిలో హిందూ




ధర్మ రక్షణ, మతమార్పిడుల అడ్డుకట్ట దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన వివాదాస్పదం అవుతున్నారు.తన సొంత నియోజకవర్గంలో శ్రీరామనవమినాడు జరిగిన పరిణామాలు గురించి తెలిసిందే. శ్రీరాముడి విగ్రహానికి పూలమాలలు వేసేందుకు వెళ్తున్న ఆయనపై దాడి జరిగింది. అయితే దీనిని హిందుత్వవాదులు ముక్తకంఠంతో ఖండించారు. రాజకీయ పార్టీలు సైతం స్పందించాయి. ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్ప. అయితే ఈ రామాలయ వివాదాన్ని సీరియస్ గా తీసుకున్న రఘురామకృష్ణంరాజు తన అజెండాను అమలు చేయడం ప్రారంభించారు. రాష్ట్రంలో వ్యవస్థీకృతంగా జరుగుతున్న మతమార్పిడులను రఘురామకృష్ణంరాజు మాఫియాగా అభివర్ణించారు. తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే పోరాటం చేయడం ప్రారంభించారు.రాష్ట్రంలో మతమార్పిడులు అనేవి గత కొన్నేళ్లుగా జరుగుతూ వచ్చాయి. పేదరికంతోపాటు అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని సాగుతున్న మార్పిడులపై రఘురామకృష్ణంరాజు గట్టిగానే దృష్టిపెట్టారు. గట్టి హెచ్చరికలు జారీచేశారు. అయితే రఘురామకృష్ణం రాజు రాజకీయ చర్యలను వ్యతిరేకించేవారు ఇప్పుడు ఈ మతమార్పిడిలపై ఆయన చేస్తున్న పోరాటంపై ఏం చేయాలో వారికి పాలు పోవడం లేదు. ఎందుకంటే భారతీయ జనతా పార్టీ విధానం కూడా అదే. పైగా కూటమి పార్టీలో రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నారు రఘురామకృష్ణంరాజు. అయితే ఇప్పుడు ఈ మతమార్పిడులకు వ్యతిరేకంగా ఆయన తీసుకున్న గళం ఏపీలో విస్తరిస్తోంది. ప్రజల్లో ఆలోచన తెచ్చిపెడుతోంది. ఇప్పటివరకు రఘురామకృష్ణం రాజు అంటే రాజకీయ కోణంలో ఆలోచించిన వారే ఉండేవారు. అయితే రఘురామకృష్ణం రాజు పై కొంతమంది పాస్టర్లు బాహటంగానే వ్యాఖ్యానించడం ఆయనకు హిందూ సమాజంలో మద్దతు పెరిగేందుకు దోహద పడిందిమతమార్పిడుల విషయంలో మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని రఘురామకృష్ణంరాజు నిర్ణయం తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల తరహాలో ఏపీలో కూడా మతమార్పిడిల నిరోధక చట్టం తీసుకురావాలని డిమాండ్ ను రఘురామకృష్ణం రాజు బలంగా వినిపించడం ప్రారంభించారు. బలవంతంగా మతమార్పిడులను చేయడం, అందుకు ప్రలోభాలకు గురిచేయడం వంటి వాటిపై కఠినమైన చట్టాలను ప్రయోగించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇప్పటికే కూటమిలో కీలకంగా ఉన్నారు రఘురామకృష్ణంరాజు. పైగా రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నారు. ఆపై కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ విధానం కూడా అదే. మరోవైపు రాష్ట్రంలో హిందూ ఓటు బ్యాంకు ను ఏకీకృతం చేయడంలో రఘురామకృష్ణంరాజు కీలక పాత్ర పోషిస్తున్నట్లు అర్థమవుతోంది. ఇది కూటమికి కలిసి వచ్చే అంశం గాను స్పష్టమవుతుంది. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై హిందూ వ్యతిరేక ముద్ర ఉంది.

# దువ్వాడ స్థానంలో వాణికే అవకాశం

విజయనగరం, ఏప్రిల్ 15,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దువ్వాడ శ్రీనివాస్ పై వేటు వేసింది. వ్యక్తిగత కుటుంబ వ్యవహార శైలితో పార్టీ ఆయనను దూరం పెట్టింది. అయితే ఆయన తిరిగి వైసీపీకి దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అవి వర్కౌట్ అయ్యేలా లేవు. ధర్మాన సోదరులతో పాటు దాదాపు వైయస్సార్ కాంగ్రెస్ నాయకులంతా దువ్వాడ శ్రీనివాసుని వ్యతిరేకిస్తున్నారు. సామాజిక వర్గ కోణంలో చూపి తమ్మినేని సీతారాం ద్వారా ప్రయత్నాలు చేశారు దువ్వాడ. కానీ ఆ ప్రయత్నలేవి వర్కౌట్ కాలేదు. దీనికి తోడు దువ్వాడ శ్రీనివాస్ వాణి ఇప్పుడు వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తద్వారా దువ్వాడ శ్రీనివాస్ దూకుడుకు ఆమె బ్రేక్ వేసినట్టు కనిపిస్తున్నారు. జిల్లా పార్టీ పెద్దల ప్రోత్సాహంతోనే ఆమె యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన దువ్వాడ శ్రీనివాస్ వైసీపీ పెద్దలపై రగిలిపోతున్నట్లు సమాచారం.దువ్వాడ వాణి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఒక విధంగా వాణి కుటుంబం వల్లే దువ్వాడ శ్రీనివాస్ కు ఆ పేరు వచ్చింది. టెక్కలి ఎంపీపీ తో పాటు జడ్పిటిసి గా కూడా ఉన్నారు వాణి. మొన్నటి ఎన్నికల్లో ఆమెకు ముందుగా టికెట్ ప్రకటించారు జగన్మోహన్ రెడ్డి. కానీ చివరి నిమిషంలో దువ్వాడ శ్రీనివాస్ కు ఇచ్చారు. అయితే ఎన్నికల అనంతరం దువ్వాడ కుటుంబంలో రేగిన వివాదం గురించి అందరికీ తెలిసిందే. అప్పట్లోనే వాణి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దువ్వాడ శ్రీనివాస్ లాంటి వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. అయితే ఆ నిర్ణయం ఆలస్యంగా తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. దువ్వాడ శ్రీనివాస్ పై వేటు వేశారు. అయితే తిరిగి పార్టీలోకి దువ్వాడ చేరుతానని ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ధర్మాన సోదరులపై మాత్రం అనుచిత వ్యాఖ్యలు తగ్గించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో దువ్వాడ శ్రీనివాస్ కు చెక్ చెప్పేందుకు దువ్వాడ వాణి రంగంలోకి దిగారు.దువ్వాడ శ్రీనివాస్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన క్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు వాణికి అప్పగిస్తారని అంత ప్రచారం నడిచింది. కానీ అనూహ్యంగా పేరాడ తిలక్ కు ఇచ్చారు. అయినా సరే దువ్వాడ వాణి జిల్లా వైసీపీ పెద్దలతో మంచి సంబంధాలు నడుపుతూ వచ్చారు. అయితే టెక్కలిలో కింజరాపు అచ్చెనాయుడుకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిపారని.. దిష్టిబొమ్మను దహనం చేశారని పోలీసులు పేరాడ తిలక్ ను అరెస్టు చేశారు. ఆ సమయంలో వైసీపీ నేతలు టెక్కలిలో ఆందోళన చేపట్టారు. పోలీస్ స్టేషన్ ఎదుట వాణి బైఠాయించారు కూడా. టెక్కలి వైసీపీలో మరోసారి దువ్వాడ శ్రీనివాస్ కు ఛాన్స్ ఇవ్వకూడదని.. ఆయనను తిరిగి పార్టీలో చేర్చకూడదని.. టెక్కలిలో తిలక్ ను గెలిపిస్తే నామినేటెడ్ పోస్టు వాణికి ఇస్తామన్న ఆఫర్ తోనే ఆమె యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది

# పాత, మోతలతో వైసీపీ నేతలు



శ్రీకాకుళం, ఏప్రిల్ 15, సాధారణంగా రాజకీయాల్లో విమర్శలు కామన్. అయితే గతం మాదిరిగా సిద్ధాంతపరంగా పార్టీలో కొనసాగే వారు తక్కువ. కానీ ఒక పార్టీలో కొనసాగాలంటే ప్రత్యర్థి పార్టీ నేతపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయాలి. అటువంటి పరిస్థితి నేటి రాజకీయాల్లో కొనసాగుతోంది. అయితే ఇప్పుడు అదే నేతలకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. తాజాగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని ఇద్దరు మాజీ మంత్రులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గతంలో వారు కాంగ్రెస్ పార్టీలో కొనసాగినప్పుడు జగన్మోహన్ రెడ్డి పై చాలా కామెంట్లు చేశారు. ఆయన పై వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. ఇప్పుడు ఆ విమర్శలను గుర్తు చేస్తూ టిడిపి కూటమి జగన్మోహన్ రెడ్డిని ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. అయితే జగన్మోహన్ రెడ్డికి మించి ఓ ఇద్దరు మాజీ మంత్రులు చాలా బాధపడుతున్నారు. వారే బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సమయంలో జగన్మోహన్ రెడ్డి పై ధర్మాన తో పాటు బొత్స చాలా వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీని విభేదించి వైసీపీ ఏర్పాటు చేసుకున్నారు జగన్. ఆ సమయంలో చాలామంది నేతలు జగన్ వెంట అడుగులు వేశారు. కానీ బొత్స తో పాటు ధర్మాన కాంగ్రెస్ పార్టీలో ఉండిపోయారు. ఎందుకంటే అప్పటికే ధర్మాన కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక మంత్రిగా వ్యవహరిస్తున్నారు. బొత్స సత్యనారాయణ అయితే పార్టీలో టాప్ 5 లో ఉండేవారు. పైగా ఉమ్మడి రాష్ట్రానికి పిసిసి అధ్యక్షుడిగా కూడా ఉండేవారు. అయితే ఈ ఇద్దరు నేతలు జగన్మోహన్ రెడ్డి పై చెయ్యని వ్యాఖ్యలు అంటూ లేవు. ఆయన వ్యాపారాలపై మాట్లాడారు. నేర ప్రవృత్తి పై వ్యాఖ్యలు చేశారు. దాదాపు వైసీపీ ఆవిర్భావం నుంచి 2014 ఎన్నికల వరకు ఈ ఇద్దరు నేతలు చేయని వ్యాఖ్యలు అంటూ లేవు.జగన్మోహన్ రెడ్డి వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టిడిపి రంగంలోకి దిగింది. మేం చెప్పే కంటే.. వైసీపీలో ఉన్న బొత్స, ధర్మానలు చెప్పినవి ఇవి అంటూ పాత మీడియా క్లిప్పింగులు తీసి మరి చూపిస్తున్నారు టిడిపి నేతలు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాత క్లిప్పింగులు తీసి వీరి విమర్శలను మీడియా ముందు ప్రదర్శించారు. అయితే ఇక్కడ తెలుగుదేశం పార్టీకి ఒక లక్ష్యం ఉన్నట్టు కనిపిస్తోంది. జగన్ వైఖరి గురించి సొంత పార్టీ వారి అభిప్రాయం చెప్పించే ప్రయత్నం ఒకటి కాగా.. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై జగన్ అనుమానపు చూపులు చూసేలా చేయాలన్నది ప్రణాళికగా కనిపిస్తోంది. ఇలా ఎలా చూసుకున్నా ఇప్పుడు జగన్ కంటే ధర్మాన, బొత్స ఇరకాటంలో పడుతున్నారు. ఒకవేళ జగన్మోహన్ రెడ్డి దీనిని వ్యక్తిగతంగా తీసుకుంటే మాత్రం తమ పొలిటికల్ లైఫ్ క్లోజ్ అవుతుందని భయపడిపోతున్నారు. అనుచరుల వద్ద ఇదే మాటలు చెప్పి వణికిపోతున్నారు.

# పక్కా వ్యూహాలతో తమ్ముళ్లు..

విజయవాడ, ఏప్రిల్ 15,తెలుగుదేశం పార్టీ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు అటాక్ అనేది ఆ పార్టీ స్ట్రాటజీ కాదు. రాజకీయ విమర్శలు వస్తే దానికి ధీటైన కౌంటర్ ఇవ్వడమే ఆ పార్టీ నేతలు చేసే పని. కానీ ఇటీవల పరిణామాలు చూస్తుంటే మాత్రం ముందే టిడిపి మంత్రులు అటాక్ చేయడం చూస్తుంటే మాత్రం ప్రత్యేక వ్యూహం ఉన్నట్టు అర్థమవుతుంది. జగన్ మావిగన్ రాజధాని ప్రతిపాదన తర్వాత రకరకాలుగా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. సరిగ్గా అదే సమయంలో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సెగలు పుట్టించాయి. అయితే ఆయన ఒక్కడే కాదు. ఆ తరువాత మంత్రి పయ్యావుల కేశవ్. అటు తరువాత మంత్రి వంగలపూడి అనిత, చివరకు నిమ్మల రామానాయుడు.. ఇలా అంతా వరుసగా మీడియా ముందుకు వచ్చి సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుపెన్నడూ లేని విధంగా టిడిపి మంత్రులు ఈ తరహా అటాక్ చేయడం వైసీపీకి నిద్ర పట్టడం లేదు.సాధారణంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువగా కౌంటర్ అటాక్ ఉంటుంది. దీనిపైనైనా మూకుమ్మడి దాడి ఆ పార్టీ పుణ్యమే. అది వారికి అలవాటైన విద్య కూడా. కానీ టిడిపి మాత్రం అలాంటి విమర్శలు వచ్చినప్పుడు వాటికి సమాధానం చెప్పడమే. అదేపనిగా దానిని లాగి బయటకు ప్రచారం చేయడం ఉండదు. కానీ ఫస్ట్ టైం టిడిపి మంత్రులు అటాక్ చేయడం ప్రారంభించారు. తండ్రి అధికారం కోసం జగన్మోహన్ రెడ్డి ఎంత ఆరాటపడ్డారు.. ప్రస్తుతం వైసీపీలో ఉన్న నేతలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి పై ఏవిధంగా మాట్లాడారు అన్న విషయాలను గుర్తు చేస్తూ అచ్చెనాయుడు చేసిన కామెంట్స్ ఏపీ పొలిటికల్ వర్గాల్లో ప్రకంపనలు రేపాయి. తరువాత అదే స్థాయిలో మాట్లాడారు పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత. చివరకు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా హత్య గురించి ప్రస్తావిస్తూ వైసిపి పై విమర్శలు చేశారు.అయితే ఈ మొత్తం పరిణామాలతో మావిగన్ రాజధాని ప్రతిపాదన హైలెట్ అయింది. దానికి వ్యతిరేక ప్రచారం తోడైంది. వాస్తవానికి మావిగన్ పై వచ్చిన వ్యతిరేకతను.. అనుకూలంగా మార్చుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. మూడు నెలల పాటు దానికి టార్గెట్ పెట్టుకుంది. అదే పనిగా మావిగన్ ప్రచారం చేస్తే ప్రజల్లో క్రమేపి సానుకూలత వస్తుందని అంచనా వేసింది. కానీ ఈ విషయాన్ని గుర్తించిన టిడిపి మంత్రుల ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం మొదలు పెట్టింది. అలా ఆ కౌంటర్ పతాక స్థాయికి తీసుకెళ్లింది. మావిగన్ పై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామనుకున్న వైసీపీ ఆశలను గండి కొట్టింది. పక్కా వ్యూహంతోనే టిడిపి మంత్రుల కౌంటర్ అటాక్ అని అర్థమైంది.

# అంబేద్కర్ జయంతి వర్ధంతుల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవం...





విభారే న్యూస్ ఏప్రిల్ 15 ఎమ్మిగనూరు..పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా అంబేద్కర్ జయంతి వర్ధంతిల కమిటీ, అంబేద్కర్ భవన నిర్మాణ ఐక్య కార్యాచరణ కమిటీ, బిసిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భావజాలాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ తన ప్రసంగాలతో యువతను ఉత్తేజపరుస్తూ యువతలో ఉద్యమ భావజాలాలు నింపుతున్న తెలంగాణ శ్యామ్ ముఖ్య అతిథులుగా హాజరవ్వగా ఉదయం ఆది ఆంధ్ర పాఠశాల దగ్గర నుండి అశ్వ వాహనంపై అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచి డ్రమ్స్ మరియు డీజే హోరులో పట్టణ, నియోజకవర్గ ప్రజలు వందల మంది యువత ఉత్సాహంతో కేరింతల కొడుతూ, గంతులు వేస్తూ, ఆనందంతో సంతోషంగా అడుగడుగునా డాన్సులు వేస్తూ ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ సర్కిల్ వరకు చేరుకొని భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్లో వేసిన స్టేజ్ దగ్గరకు అతిథులు చేరుకోవడం జరిగింది. ముఖ్య అతిథులు శ్యామ్, మల్లెలబ్లూడ్ రాజు వేదికను అలంకరించడం జరిగింది.బ్లూడ్ రాజు అంబేద్కర్ను గూర్చిన అమూల్యమైన మాటలను వినిపించడం జరిగింది.అంబేద్కర్ జయంతి వర్ధంతుల కమిటీ చైర్మన్ సప్పోగు ప్రభాకర్, గౌరవ సలహాదారులు కదురికోట సునీల్ కుమార్, మాల మహానాడు మాల నరసన్న, ఏపీ ఎమ్మార్పీఎస్ మీనుగ జయన్న, ఎంపీజే అధ్యక్షుడు లాల్కోట్ ఖదీర్, మైనార్టీ నాయకుడు మూసా, బీసీ బతకన్న,డిక్కి జిల్లా కోఆర్డినేటర్ దిలీప్ కుమార్, ఉద్యోగుల సంఘం నాయకుడు పవన్ కుమార్,బుడిమెద్దుల రవిచంద్ర,బిసిఆర్ఎఫ్ అధ్యక్షుడు అజిత్ కుమార్, రిపోర్టర్ ప్రసన్నకుమార్,రిపోర్టర్ భీమన్న, పరిగెల ప్రకాష్, జాలవాడి భీమన్న, టెంకాయల ప్రసాద్, చిన్ని ప్రసాద్, వేదికను అలంకరించి ప్రతి ఒక్కరూ రెండు నిమిషాలు రాజ్యాంగం గురించి రాజ్యాంగ రచయిత అంబేద్కర్ గురించి ప్రసంగించడం జరిగింది. అనంతరం ముఖ్య ప్రసంగీకులు తెలంగాణ శ్యాం మాట్లాడుతూ నన్ను ఈ కార్యక్రమానికి ఎంతో దూరం నుండి నన్ను ఆహ్వానించినందుకు సునీల్ కుమార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు అంటూ తెలిపారు. ఈరోజు ప్రతి ఒక్కరికి కూడా గొప్ప పండుగ అని భారతదేశం మొత్తం గర్వించదగ్గరోజు అని ఆయన అన్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు సమాజంలో జరుగుతున్న మార్పులను గురించి వివరిస్తూ రిజర్వేషన్కు ముందు ఉన్న గవర్నమెంట్ స్కూల్ ఎన్ని తర్వాత ఎన్ని,రిజర్వేషన్ కు ముందు ఉన్న ప్రైవేట్ స్కూల్స్ ఎన్ని తర్వాత ఎన్ని, విద్యను ప్రైవేటీకరణ చేస్తున్నారు వైద్యాన్ని ప్రైవేటీకరణ చేస్తున్నారు ఇంకా అనేక కంపెనీలను ప్రైవేటీకరణ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు ఈ విధంగా లెక్కలు తీసుకుంటే నేటి రాజకీయ నాయకులు ప్రైవేటీకరణ అన్నది ఎంతగా చేస్తున్నారో స్పష్టంగా వివరించారు. మహానుభావుడు గొప్ప జ్ఞానవంతుడు అంబేద్కర్ యుద్ధం చేయడమంటే కత్తులతో కాదు జ్ఞానంతో చేయాలి అన్న మాటను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని అందరూ కూడా చదువుకొని జ్ఞానాన్ని సంపాదించి, ఆ జ్ఞానంతో బ్రాహ్మణులను అగ్రకులాలను ప్రతిఘటించాలని ఆయన పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాలలో బిజెపి పాలిత ప్రాంతాలలో మెజారిటీ సీట్లను సంపాదిస్తే రాజ్యాంగాన్ని తీసివేసి మనువాదాన్ని తీసుకొస్తామని బాహాటంగా చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా అన్నదమ్ముల్లా కలిసి ఉండాల్సిన మనం విడిపోతూ ఉండటం వల్ల మన వాళ్ళని విభజించి పాలించే వారికి ఇంకా మనం అవకాశం ఇస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రాశాడు కాబట్టి ఆయన దాని నుండి ఎలాంటి ఎక్కువ ప్రతి ఫలాలను పొందలేదని ఆయన సైతం అందరిలాగే పోటీ చేసే గెలుపొందాడని అందరిలాగే సామాన్య మానవ జీవితాన్ని గడిపాడని ఆయన పేర్కొన్నారు. తన ప్రసంగంతో యువతలో ఉత్సాహాన్ని రేకెత్తించాడు. అనంతరం కదిరి కోట సునీల్ కుమార్ మాట్లాడుతూ శ్యామ్ కి ఈ కార్యక్రమానికి తన వెన్నంటి ఉండి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రసంగం ముగిసిన తరువాత తెలంగాణ శ్యామ్ ని సునీల్ కుమార్ నరసన్న శాలువాతో పూలమాలతో సత్కరించడం జరిగింది. అలాగే ఈ బృహత్ కార్యక్రమాన్ని తన భుజస్కందాలపై మోసి దిగ్విజయంగా కార్యక్రమాన్ని జరిపించిన కదిరి కోట సునీల్ కుమార్ ని జయన్న దిలీప్ శాలువాతో పూలమాలలతో సత్కరించడం జరిగింది. అనంతరం అంబేద్కర్ భవన్ స్థలం నందు భోజనాలను ఏర్పాటు చేయగా వచ్చిన శ్రోతలు నాయకులు విందును ఆరగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మైనార్టీ పట్టణ అధ్యక్షుడు మద్రి ప్రభాకర్, శాంతిరాజు, మహేష్ మేషక్ సూరి, విష్ణు, సాల్మన్, రాజు పట్టణ, వివిధ గ్రామాల నుండి వచ్చిన వందల మంది యువకులు పాల్గొనడం జరిగింది.

## రేపు అమావాస్య సందర్భంగా సూర్య దేవాలయంలో ప్రత్యేక చండీ హోమం...



విభారే న్యూస్ ఏప్రిల్ 15 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో 17.04.2026 శుక్రవారం అమావాస్య సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఉదయం 9 గంలకు నవగ్రహ, లక్ష్మీ గణపతి, మూల మంత్ర సహిత చండీహోమం నిర్వహించబడును. ఈ చండీహోమం చేసుకోవటం వలన సమస్త శతృ,రుణ, రోగ, బాధలు తొలగి సకల కార్య జయం కలుగుతుంది. అమ్మవారి అనుగ్రహం వలన ఆయురారోగ్య ఐశ్వర్యములు సిద్ధించి చండీ పరదేవత అనుగ్రహం కలుగుతుంది. హోమం ప్రధానంగా :- 4000/- సంకల్పం:- 116/- సంప్రదించవలసిన నెం :- డి.లక్ష్మీనరసింహ శర్మ :- 8008774086 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు. 8896123777.ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబర్.08518-234388[5:21 జూఎ, 15/4/2026] +91 93955 69189: ..

## రేపు అమావాస్య సందర్భంగా కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు..




విభారే న్యూస్ ఏప్రిల్ 15 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో 17-04-2026 శుక్రవారం అమావాస్య సందర్భంగా సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి శత్రు నివారణ, బాలగ్రహ దోష నివారణ, శని గ్రహ దోష నివారణ, బుద్ధి,బలం,యశో,ధైర్యం, కార్యసిద్ధి, కొరకు ఉదయం 10 గంటలకు సింధూరార్చన జరుగును. పూజలో పాల్గొన్న భక్తులకు ఆంజనేయ స్వామి డాలరు సింధూరం ప్రసాదంగా ఇవ్వబడును.రుసుము 250-/గుమ్మడికాయ -300/- సంప్రదించవలసిన నెం: అశోక్కుమారాచార్యులు 9032577369.ఫోన్ పే గూగుల్ పే నెంబరు.8896123777.

## పిహెచ్‌సీల్లో నిర్లక్ష్యం సహించం

### --గైర్హాజరు సిబ్బందిపై కలెక్టర్ కఠిన చర్యలు

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15 :-మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై సమగ్రంగా ఆరా



తీసిన కలెక్టర్, సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.తనిఖీ సమయంలో ఉదయం 10:10 గంటల వరకు ఇద్దరు వైద్యులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్ విధులకు హాజరు కాలేదని గుర్తించారు. అదేవిధంగా విధులకు రాని ముగ్గురు సిబ్బంది తరపున ఎమ్ పీ ఎచ్ ఓ ద్వారా మూవెంట్ రిజిస్టర్‌లో సంతకాలు చేయించడం బయటపడటాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు.ఈ ఘటనపై వెంటనే స్పందించిన కలెక్టర్, సంబంధిత ఐదుగురు సిబ్బందిపై తక్షణ క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సేవల్లో బాధ్యత, క్రమశిక్షణ తప్పనిసరి అని, నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటు ఉండదని స్పష్టం చేశారు.రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని, ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పాత్ర కీలకమని, సేవల్లో ఎటువంటి లోపాలు లేకుండా పనిచేయాలని వైద్య సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు.

## సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15 :-సంక్షేమ పథకాలు సమర్థవంతంగా ప్రజలకు చేరాలంటే సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం మహానంది మండలం తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల సచివాలయాలను ఆమె ఆకస్మికంగా



తనిఖీ చేశారు.సిబ్బంది ఆన్‌లైన్ హాజరు, పనితీరును పరిశీలించిన కలెక్టర్, గైర్హాజరు మరియు నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలతో మాట్లాడి సేవలపై అభిప్రాయాలు సేకరించారు.పిజిఆర్ఎస్ ఫిర్యాదులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సచివాలయ వ్యవస్థలో క్రమశిక్షణ, బాధ్యతతో సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.

## ఆస్తి పన్నుకు ప్రత్యేక రాయితీలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15-నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న తెలిపారు.2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలపై విధించే వడ్డీపై 50 శాతం మినహాయింపు కల్పిస్తున్నట్లు తెలిపారు.అలాగే 2026-27 సంవత్సరానికి ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం రిబేట్ అందిస్తామని చెప్పారు.ఈ రాయితీలు 2026 ఏప్రిల్ 30వ తేదీ వరకు మాత్రమే అమల్లో ఉంటాయని, పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థిక లాభం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జలహారతిలో భౌగోళిక సాంకేతికతలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15:-జలాధార-జలహారతి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా భౌగోళిక సాంకేతికతలను వినియోగించి నీటి భద్రతను పెంపొందించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అంతరిక్ష వినియోగాల కేంద్రం శాస్త్రవేత్త కె. లక్ష్మీకాంత రెడ్డి జిల్లా, మండల స్థాయి జల వనరుల పటాలను సమర్పించి వివరించారు.ఈ పటాల్లో వాగులు, కాలువలు, చెరువులు, నదులు, రిజర్వాయర్లు వంటి జల వనరులతో పాటు పరిపాలనా సరిహద్దులు, రహదారులు, రైల్వే మార్గాల వివరాలు పొందుపరిచినట్లు తెలిపారు. ఈ పటాలు సాగునీటి ప్రణాళికలకు ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలో నీటి భద్రత కోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులకు ఆదేశించారు.

## ప్రమోషన్‌తో వీడ్కోలు.. డాక్టర్ సుజాతకు ఘన సన్మానం---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15-ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్‌గా సేవలందించిన డాక్టర్ సుజాత ప్రమోషన్‌పై బదిలీ కావడంతో ఆసుపత్రి వేదికగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది ఆమెకు శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ, తాను 23 సంవత్సరాల పాటు ఈ ఆసుపత్రిలో



సేవలందించడం తనకు గర్వకారణమని అన్నారు. ఈ కాలంలో ఆస్పత్రి సిబ్బంది, ప్రజల నుంచి లభించిన సహకారం మరువలేనిదని తెలిపారు. అందరి సహకారంతోనే మంచి సేవలు అందించగలిగానని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దస్తగిరి రెడ్డి, డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నంది అవార్డు గ్రహీత రామబ్రహ్మం ఆచారి మృతి--

### కళారంగానికి తీరని లోటు: డా. రవి కృష్ణ---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15-: ప్రముఖ మేకప్ కళాకారుడు, నంది అవార్డు గ్రహీత రామబ్రహ్మం ఆచారి అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన వయసు 53 సంవత్సరాలు.గోపవరం గ్రామానికి చెందిన రామబ్రహ్మం ఆచారి నంద్యాలలో శ్రీరామ డ్రస్ కంపెనీ నిర్వహిస్తూ మూడు దశాబ్దాలుగా తెలుగు పద్య, పౌరాణిక నాటకాలకు విశిష్ట సేవలు అందించారు. ఉత్తమ మేకప్ కళాకారుడిగా నంది పురస్కారం సహా పలు అవార్డులు అందుకున్నారు.ఈ సందర్భంగా కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రామబ్రహ్మం ఆచారి మృతి కళారంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వేలాది నాటకాలకు మేకప్, దుస్తులు, రంగస్థల అలంకరణలో ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు.నంద్యాలలో జరిగిన అంత్యక్రియల్లో కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళు లర్పించారు.



## అంబేద్కర్ సభలో ట్రెజరీ అధికారిణి నిర్లక్ష్యం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15-నంద్యాలలో నిన్న నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి లక్ష్మీదేవి ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. అధికారిక కార్యక్రమం జరుగుతున్న సమయంలో సెల్‌ఫోన్‌లో పేకాట ఆడుతూ కనిపించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.అంబేద్కర్ జయంతి వంటి గౌరవప్రదమైన కార్యక్రమంలో బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న అధికారి ఇలాంటి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం తగదని ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపడం విచారకరమని పేర్కొన్నారు.ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీసిన ఈ ఘటనపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## భరత్‌కు రాష్ట్ర స్థాయిలో విజయం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 15-అయ్యలూరులోని ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి పీ. భరత్ కుమార్ డ్రాగన్ బోట్ క్రీడలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో మెడల్ సాధించారు. విజయవాడలో ఏప్రిల్ 11, 12 తేదీలలో జరిగిన అండర్-18 పోటీలలో ఆయన మెరిసారు.శారీరక అంగవైకల్యం ఉన్నప్పటికీ క్రీడల్లో రాణించడం అభినందనీయమని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా ఎం.డి. దినేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ వై. హరిప్రసాద్ రెడ్డి తదితరులు భరత్‌ను అభినందించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**